క్లుప్తంగా

ఆధార్ శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

శావల్యాపురం: ఆధార్ అప్‌డేట్ విధానం వలన ప్రభుత్వ పథకాలు అర్హత కలిగిన లబ్ధిదారులు వర్తిస్తాయని ఎంపీడీవో పేరు మీనా సీతారామయ్య మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు తొలి రోజు మండలంలోని కారుమంచి గ్రామ సచివాలయంలో ఆధార్ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 23న గుంటుపాలెం, 24న పోట్లూరు, ఈనెల 25న చివరిరోజు వేల్పూరు గ్రామ సచివాలయం పరిధిలో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కళాకారులకు నంది, నటరాజ అవార్డులు



నరసరావుపేట రూరల్: హైద్రాబాద్ త్యాగరాజ గానసభలో సోమవారం ఆదర్శ కళా నిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన నాట్యనీరాజనంలో పట్టణానికి చెందిన శివానంద కళాక్షేత్రం చిన్నారులు 20 మంది ఆదర్శనం నంది అవార్డులు, ఆరుగురు నటరాజ అవార్డులు కైవసం చేసుకున్నారు. అన్నమాచార్య, త్యాగరాజ కీర్తనలు ఇతర సంస్కృత కీర్తనలతో చిన్నారి కళాకారులకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పల్నాడులో ప్రధానమైన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి పాట నీరాజనంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మాతృ శివానంద కళాక్షేత్రం నిర్వాహకుడు డాక్టర్ పాలూరి కృష్ణవాసు శ్రీకాంత్‌ను ఆదర్శ కళానిలయం నిర్వాహకులు నటరాజ స్వామివారి ప్రతిమతో సత్కరించారు.

భోజనశాల నిర్మాణానికి భూమిపూజ



వినుకొండ(నూజెండ్ల): రూరల్ మండలంలోని అందుగుల కొత్తపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసిస్ట్, ఐటీసీ, ఎంఎస్‌కే వారి సహకారంతో పాఠశాలలో భోజనశాల నిర్మాణానికి భూమిపూజ మంగళవారం నిర్వహించారు. రూ.14 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఈ భవనంలో రూ.12 లక్షలు సేవా సంస్థలు, రూ.2 లక్షలు ప్రజల భాగస్వామ్యంతో నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో ఐటీసీ ప్రతినిధి శివయ్య, దీపిక, జాహ్నవి, పాఠశాల చైర్మన్ వై.శ్రీనివాసరావు, హెచ్ఎం శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారికి శత సహస్ర పుష్పార్చన



నరసరావుపేట రూరల్: మండలంలోని ఇస్సప్పాలెం గ్రామంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారికి శ్రావణమాసం మంగళవారాన్ని పురస్కరించుకుని శత సహస్ర పుష్పార్చన సేవ నిర్వహించారు. చిలకలూరిపేటకు చెందిన వ్యాపారవేత్త తేళ్ల సుధీర్, స్రవంతి దంపతులు పూల దాతలుగా వ్యవహరించారు. పూజాకార్యక్రమం అనంతరం దాతలకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పుష్పార్చన సేవలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డి, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు. త్వరలో రాతిలో చేపట్టనున్న ఆలయం, బాహు మండపం నిర్మాణానికి దాతలు ఆర్థిక సహాయం అందించి సహకరించాలని ఆలయ ఈఓ సుధాకరరెడ్డి కోరారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు మంగళవారం తెలిపారు. ఇస్లాంపేటకు చెందిన షేక్ మస్తాన్‌వలి చిత్రాలయ టాకీస్ వద్ద అక్రమంగా తెలంగాణ రాష్ట్ర మద్యం 16 బాటిళ్లు కలిగి ఉండటంతో అతన్ని అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు.

రీసర్వేలో శాశ్వత భూహక్కు పత్రాలు



బొల్లాపల్లిలో మాట్లాడుతున్న మండల సర్వేయర్



గ్రామ సభలో రైతులతో మాట్లాడుతున్న నాదెండ్ల తహసీల్దార్ రమణ

బొల్లాపల్లి: క్షేత్రస్థాయిలో సాగులో ఉన్న రైతులకు ప్రభుత్వం రీసర్వే ద్వారా శాశ్వత భూహక్కు కల్పిస్తామని మండల సర్వేయర్ జి.ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. భూరక్ష శాశ్వత భూహక్కు పథకంలో భాగంగా పేరూరుపాడు గ్రామంలో రీ సర్వే ప్రారంభానికి ముందస్తుగా మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేయర్ మాట్లాడుతూ ప్రభుత్వమే స్వయంగా రీ సర్వేలో ప్రతి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వ ఖర్చు ద్వారా హద్దులు ఏర్పాటు హక్కు పత్రాలు అందజేస్తుందని తెలిపారు. ప్రతి రైతు వారికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, ఆయా రెవెన్యూ అధికారులకు అందజేయాలని సూచించారు. గ్రామ సభలో సర్పంచ్ ఎం.స్వాతి, వి.ఆర్.ఓ. నన్నేషా, గ్రామ సర్వేయర్లు సిహెచ్ సోమనాథ బాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సర్వేపై అభ్యంతరాలుంటే విన్నవించండి

నాదెండ్ల: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష సర్వే కార్యక్రమంపై అభ్యంతరాలు ఉన్నట్లయితే రైతులు అర్జీలు అందజేయాలని తహసీల్దార్ ఏవీ రమణ తెలిపారు. మండలంలోని ఇర్లపాడు గ్రామంలో సర్పంచ్ మంగు రమాదేవి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పరిధిలో 3470 ఎకరాల పంట భూమి ఉందని, ఇప్పటి వరకూ సర్వే పూర్తయిందని, రైతులకు 9(2) నోటీసులు అందజేస్తున్నట్లు చెప్పారు. ఇచ్చిన నోటీసుల్లో విస్తీర్ణంలో గానీ, గట్లలో గానీ సర్వే నెంబర్లలో గానీ తేడాలుంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలన్నారు. ఇప్పటి వరకూ గ్రామంలో సర్వే జరిగిందని, రైతులు డాక్యుమెంట్లను పరిశీలించుకోవాలన్నారు. కొందరు రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని వీఆర్వోలు, సర్వేయర్ల బృందాన్ని సూచించారు. కార్యక్రమంలో గణపవరం సొసైటీ చైర్మన్ మంగు ఏడుకొండలు, మండల సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు, డీటీ అనురాధ, ఆర్ఐ రమీజా పాల్గొన్నారు.

మహిళా సంరక్ష కార్యదర్శులు పర్యవేక్షించాలి

ఇన్‌చార్జ్ సీడీపీఓ మాణిక్యాలరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ సీడీపీఓ మాణిక్యాలరావు

నరసరావుపేట రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాల్సిన బాధ్యత మహిళా సంరక్ష కార్యదర్శులపై ఉందని ఇన్‌చార్జ్ సీడీపీఓ బి.మాణిక్యాలరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మహిళా సంరక్ష కార్యదర్శుల జాబ్ చార్టర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నరసరావుపేట, రొంపిచర్ల మండలాలతోపాటు పట్టణంలోని మహిళా సంరక్ష కార్యదర్శులు కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీడీపీఓ మాట్లాడుతూ మహిళా సంరక్ష కార్యదర్శులు కేవలం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించడానికే పరిమితమవుతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఇవి సక్రమంగా వారికి చేరుతున్నాయా లేదా పర్యవేక్షించాల్సిన బాధ్యత కూడా మహిళా సంరక్ష కార్యదర్శులపై ఉందన్నారు. అలాగే బాల్య వివాహాలు జరగకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కుంట భూముల్లో ఆక్రమణలు తొలగించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఉప్పలపాడు గ్రామస్తులు

వినుకొండ(నూజెండ్ల): ఆక్రమణకు గురైన అబ్బినేటి కుంటను సర్వే చేసి పూర్తిస్థాయిలో కుంట భూములను కాపాడాలని కోరుతూ తహసీల్దార్ మధుబాబు, సర్వేయర్ చండీరాణికి నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామసర్పంచ్ కట్టెంపూడి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ దూపాటి వెంకటమ్మలతో పాటు పలువురు కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో కొంతమంది కుంట భూములను ఆక్రమించడం వల్ల విస్తీర్ణం తగ్గిపోయిందని, వెంటనే సర్వే చేయించి ఆక్రమణలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో లక్కిరెడ్డి వెంకటరెడ్డి, సింగం శ్రీనివాసరెడ్డి, ముక్కమళ్ల రామకృష్ణా రెడ్డి, కొండారెడ్డి, నంబుల రవి, కోటిలింగం, గద్దల శ్రీనులతో పాటు రైతులు పాల్గొన్నారు.

క్రీడా మైదానంలో అభివృద్ధి పనులు



మైదానాన్ని ట్రాక్టర్లతో చదును చేస్తున్న దృశ్యం

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధి చేయిస్తున్నట్లు శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో శిథిలావస్థకు చేరిన భవన సముదాయాలు పడివేసిన ఏరియాలో వర్షం వచ్చినప్పుడు నీరు నిలబడి విద్యార్థులు అగచాట్లు పడుతున్నాయని, విష సర్పాలు సంచరిస్తున్నాయని గుర్తించామని దీంతో యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించామన్నారు. పొక్లయిన్, జోజరు, ట్రాక్టరు యంత్ర పరికరాలు ద్వారా గుంతను పూడ్చివేయటంతో పాటు బాలికల టాయిలెట్స్ సమీపాన లెవలింగ్ పనులు చేయిస్తున్నామన్నారు. త్వరలో మండలస్థాయిలో శావల్యాపురం హైస్కూల్లో జరగనున్న ఆడుదాం ఆంధ్రా వివిధ రకాల క్రీడా పోటీలకు క్రీడామైదానం ఎంతోగానో దోహదపడుతుందన్నారు. పనులు పరిశీలించిన వారిలో పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, శ్రీకాంత్ ఉన్నారు.

క్రీడా సామగ్రి వితరణ



బొల్లాపల్లి: మండల కేంద్రంలోని అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల వసతి గృహానికి హెల్త్ సూపర్‌వైజర్ సి.హెచ్. చలపతిరావు క్రీడా సామగ్రి వితరణగా అందజేశారు. సుమారు రూ.3 వేలు విలువ చేసే చదరంగం, చైనీస్ చక్కర్, స్కిప్పింగ్ తాళ్లు, టెన్ని కాయిన్, క్యారమ్‌బోర్డు వంటివి తదితర ఆట వస్తువులను బొల్లాపల్లి పి.హెచ్.సి. వైద్యాధికారి పి.శంకర్‌నారాయణ చేతుల మీదుగా వసతి గృహం వర్డెన్ నాగేంద్రంకు, విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ బాలికలు క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, బాలికలు సద్వినియోగపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది, అసిస్ట్ హాస్టల్ సిబ్బంది, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసి.. ఇంటికి నిప్పు పెట్టి..!

నరసరావుపేట టౌన్: వ్యక్తిపై దాడి చేయటంతో పాటు అతని ఇంటిని దగ్ధం చేసిన సంఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. చంద్రబాబునాయుడు కాలనీకు చెందిన అమర్‌నాథ్ అదే కాలనీ సెంటర్‌లో టీ తాగుతుండగా రాజేష్, బాజీలు మద్యం సేవించి వచ్చి గొడవ పడ్డారు. స్థానికులు సర్ది చెప్పటంతో ఇద్దరు వెళ్లిపోయారు. కొన్ని గంటల తర్వాత అమర్‌నాథ్ నివాసం ఉండే పూరిగుడిసెను రాజేష్, బాజీలు నిప్పుపెట్టారు. సంఘటనలో గుడిసెతో పాటు పక్కనే ఉన్న మరో పూరిల్లు దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పెంపొందించాలని ఎంఈవో పుసులూరి లలితాకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని పిచికలపాలెం గ్రామంలో ఎంపీయూపీ, ఎంపీపీ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏంఈవో మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను వెలికి తీయడానికి ఉపాధ్యాయులు అంకిత భావంతో తమ విధులు నిర్వహించాలన్నారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మెను ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు పారదర్శకంగా అమలు చేయించే బాధ్యత అయా పాఠశాలల్లోని ప్రధానోపాధాయులపై ఉందన్నారు. అనంతరం ఆయా పాఠశాలల పరిధిలో రికార్డులు పరిశీలించారు. అలాగే విద్యార్థుల బోధన తీరును స్వయంగా పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. పాఠశాలలు ప్రధా నోపాధ్యాయులు విజయశ్రీ, మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీమ్ సుల్తానా

రొంపిచర్ల: మండలంలోని మునమాక, విప్పర్ల సెక్టార్‌ల పరిధిలోని అన్నవరం, తురిమెళ్ల, విప్పర్ల సచివాలయాల్లో మంగళవారం బాల్య వివాహాలవల్ల కలిగే నష్టాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బాలికలను విద్యావంతులైనప్పుడే బాల్య వివాహాలను అరికట్టవచ్చు అని సూపర్‌వైజర్ షమీమ్ సుల్తానా అన్నారు. కుటుంబంలో బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, వారి స్థితిగతులను ప్రతితల్లి గమనిస్తూ ఉండాలన్నారు. పిల్లలతో సక్యతగా మాట్లాడుతూ వారికి తోడ్పాటును ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే చట్టపరంగా శిక్షకు గురికావలసి వస్తుందన్నారు. అబ్బాయికి 21 సంవత్సరాలు, అమ్మాయికి 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహాలు జరపాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, పలువురు మహిళలు, పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా మంగళగౌరీ వ్రతం



మంగళగౌరీ వ్రతంలో దేవతా మూర్తులు

రొంపిచర్ల: మండలంలోని మహిళలు మంగళవారం మంగళగౌరీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసంలో వచ్చే మొదటి మంగళవారం రోజున మంగళగౌరీ వ్రతాన్ని నిర్వహించుకోవటం మహిళలకు ఆనవాయితీగా వస్తుంది. ఈ వ్రతాన్ని నిర్వహించుకునే మహిళలు తమ ఇళ్లను మామిడి తోరణాలతో అందంగా అలంకరించుకుని మంగళగౌరీ పూజలు నిర్వహించారు. ముత్తయిదువులను పేరంటానికి ఆహ్వానించి తాంబూలాలు అందజేసి వారి నుంచి దీవెనలు అందుకున్నారు. మరికొందరు మహిళలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



లబ్ధిదారుడికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించే సీఎం రిలీఫ్ ఫండ్ అందరికీ ఉపయోగపడుతుందని పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మంగళవారం గుంటూరు ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం అందజేశారు. అమరావతి మండలం జిడుగు మండలానికి చెందిన వింత గౌతమికి రూ.2 లక్షలు, క్రోసూరుకు చెందిన షేక్ మస్తాన్‌బీకి రూ.55 వేలు, క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామానికి చెందిన సయ్యద్ దరియావలికి రూ.45 వేలు మొత్తం రూ.3 లక్షల విలువైన చెక్కులను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడేవారు, వైద్యానికి ఖర్చుపెట్టే స్తోమత లేనివారు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో క్రోసూరు వైఎస్సార్ సీపీ నాయకులు తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, అబ్దుల్ ఘని, డాక్టర్ షరీఫ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మాదల(ముప్పాళ్ల): మండలంలోని మాదలకు చెందిన భార్యాభర్త ద్విచక్రవాహనంపై నుంచి పడి గాయపడిన ఘటన సోమవారం రాత్రి జరిగింది. మండలంలోని మాదల ఎస్సీ కాలనీకి చెందిన బొడ్డేటి వెంకయ్య భార్యతో కలసి ద్విచక్రవాహనంపై ముప్పాళ్ల నుంచి వస్తూ ప్రమాదవశాత్తూ పెట్రోల్‌బంక్ సమీపంలో కింద పడ్డారు. ఎవరూ పట్టించుకోకపోవటంతో, అదే సమయంలో సత్తెనపల్లి నుంచి వస్తున్న మాజీ శాసనసభ్యులు యర్రం వెంకటేశ్వరరెడ్డి గమనించారు. వెంటనే కారు దిగి చికిత్స నిమిత్తం ఆటోలో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు పంపించారు.

ఆట్యా–పాట్యా క్రీడాకారులకు అభినందనలు



జూనియర్ ఆట్యా–పాట్యా జట్టు క్రీడాకారులతో ఉపాధ్యాయులు

నకరికల్లు: రాష్ట్ర స్థాయి ఆట్యా–పాట్యా జూనియర్ విభాగం చాంపియన్‌గా పల్నాడు జిల్లా జట్టు నిలిచింది. ఆ జట్టులో స్థానిక జెడ్పీ స్కూల్ విద్యార్థులు ఎనిమిది హాజరై ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు టి.నగేష్ మాట్లాడుతూ ఆట్యా– పాట్యా పల్నాడు జిల్లా బాలుర జట్టులో కె.శ్రీనివాస్, షేక్ ఇస్మాయిల్, బాలికల జట్టులో పి.తిరుపతమ్మ, టి.రామాంజలి, పి.స్రవంతి, కె.సరిత, బి.మౌనిక, కె.సౌమ్యశ్రీ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ షేక్ మస్తాన్‌వలి, ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య, సిబ్బంది కె.వెంకటేశ్వరరావు, ఎం.అశోక్, సీహెచ్ ఓబయ్య, కె.సువర్ణరాజు, టి.కిరణ్మయి, ఏ స్వర్ణకుమారి, కె.హేమలతాకుమారి పాల్గొన్నారు.

ఓట్ల లెక్క తేలింది..!

- పక్కాగా పూర్తయిన ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే
- సత్తెనపల్లి నియోజకవర్గంలో 95.60 శాతం పూర్తి
- నియోజకవర్గంలో 2,32,998 మంది ఓటర్లు



ఇంటింటి ఓటర్ల సర్వే వివరాలను వెల్లడిస్తున్న ఆర్డీఓ రాజకుమారి

సత్తెనపల్లి: ప్రతి ఏడాది ఎన్నికల సంఘం ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ –2024 పేరిట స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. జూలై 21న ప్రారంభమైన ఈ సర్వే సోమవారం (ఆగస్టు 21)తో ముగిసింది. బూత్ స్థాయి అధికారులు, బూత్ లెవెల్ ఏజెంట్లు పట్టణంలోని వార్డుల్లో, గ్రామాల్లో నేరుగా ఇంటింటికి వెళ్లి ఓటర్ల సర్వే చేసి పూర్తి వివరాలు సేకరించారు.

రాజకీయ పార్టీలతో సమావేశాలు

పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీగా వ్యవహరిస్తుంది. ఇంటింటి సర్వేను యోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి దగ్గరుండి పర్యవేక్షించారు. ఇంటింటికి వెళ్లి ఆమె స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేశారు. తొలుత రాజకీయ పార్టీలతోనూ సమావేశాలు నిర్వహించారు. మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఇంటింటి సర్వే వివరాలను వెల్లడించారు.

సర్వే సాగింది ఇలా.....

అర్హత ఉండి 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే వారిని ఓటర్ల జాబితాలో చేర్చారు. వీరి నుంచి ఫారం–6తో పాటు వయసు ధ్రువీకరణ పత్రం తీసుకున్నారు. తప్పుల సవరణ, కొత్త ఓట్ల నమోదు, మృతులు, నకిలీ ఓట్లు గుర్తించారు. ఓటర్ల జాబితాలో ఒకటి కన్నా ఎక్కువ సార్లు ఓటు నమోదైనా, శాశ్వతంగా గ్రామం విడిచి వెళ్లిన వారు ఉంటే అలాంటి వారి ఓట్లు కూడా గుర్తించే అవకాశం కల్పించింది ఎన్నికల కమిషన్. ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో ఫొటో సరిగ్గా కనిపించినట్లయితే మార్చుకునే అవకాశం కల్పిస్తారు. వయసులో వ్యత్యాసం ఉన్నా, ఇంటి చిరునామా మార్పు ఉన్నా, వ్యక్తిగత వివరాల్లో మార్పులు, చేర్పులు ఉంటే సవరించుకోవడానికి అవకాశం ఇచ్చారు. ఒకే ఇంట్లో పదికి మించి ఎక్కువ ఓట్లు ఉంటే వారిని గుర్తించి ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసి వారి ఓట్లు నిజమైతే వారికి తాత్కాలికంగా నోషనల్ ఇంటి నంబర్లు జారీ చేశారు. ఓటర్ల జాబితా సవరణకు ఓటర్ యాప్ వెర్షన్ 5.1 ద్వారా కొత్త ఓట్ల నమోదు, పాతవి తొలగించడం వంటివి యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు.

సర్వేలో గుర్తింపులు ఇలా...

నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు	- 2,32,998 మంది
పురుషులు	-1,14,326 మంది
మహిళలు	-1,18,655 మంది
ఇతరులు	-17 మంది
సర్వే చేసిన ఓటర్లు	-2,22,741 మంది
సర్వే శాతం	-95.60 శాతం
ఆబ్‌సెంట్ ఓటరు	-3,464 మంది
షిఫ్టెడ్ ఓటర్లు	-728 మంది
చనిపోయిన ఓటర్లు	-1,858 మంది
ఫొటోలు సరిగ్గా లేని ఓటర్లు	-292 మంది
రిపీటెడ్ ఓటర్లు	-165 మంది

సర్వే సమయంలో వచ్చిన దరఖాస్తులు...

నమోదుకు ఫారం–6	- 1,972
తొలగింపునకు ఫారం7	- 1,549
అడ్రస్ మార్పుకు ఫారం–8	- 1,744

సాయిబాబా మందిర భక్తుల భిక్షాటన



క్రోసూరు: మండలంలోని సాయిబాబు మందిర భక్తులు మంగళవారం నుంచి భిక్షాటన కార్యక్రమం ప్రారంభించారు. వారం పాటు నిర్వహించనున్న కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు మన్నెం వెంకట్రావు బాబాకు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. తొలిరోజు అందుకూరు, బాలెమర్రు, విప్పర్ల, ఏల్చూరు, గ్రంధసిరి గ్రామాలు పర్యటించారు. ప్రతి గురువారం మందిరంలో నిర్వహించే పేదల అన్నదాన కార్యక్రమాలకు కావాల్సిన బియ్యం, తదితర నిత్యావసర వస్తువులు భిక్షాటనలో సేకరించటం జరిగిందని వెంకట్రావు తెలిపారు. బాబాకు శఠగోపం(వెండి లేదా కంచుది) అందించేందుకు భక్తులు ముందుకు రావాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు కోరారు.

చిన్నారులకు చేయూతనందించాలి

సత్తెనపల్లి: మురికివాడలో నివసిస్తున్న చిన్నారులకు ప్రతి ఒక్కరూ చేయూతనందించాలని ది హెల్ప్ టు హోప్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ కె.రవి కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని వడ్డవల్లి ఏరియాలోని మురికివాడల్లో మంగళవారం చిన్నారులకు ఆహారం అందించి గుడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురికివాడల్లో నివసిస్తున్న చిన్నారులకు తమకు తోచిన సాయాన్ని అందించాలని కోరారు. ఆరోగ్యంపై చిన్నారులకు అవగాహన కల్పించారు.

దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసేలా సీఎం వైఎస్ జగన్ పాలన

మంత్రి కారుమూరి

సత్తెనపల్లి: దేశంలోని ముఖ్యమంత్రులందరూ మెచ్చుకుని రాష్ట్రం వైపు చూసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలోని అన్ని జిల్లాల అభివృద్ధి లలక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టు, ఎన్ఎస్‌పీ కెనాల్ పనులు త్వరగా పూర్తి చేయాల్సిన పనుల పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ వంద శాతం అభివృద్ధి పనులు పూర్తి చేయించడంతో పాటు ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతున్నట్లు చెప్పారు.